గడ్డెన్న వాగు నిండలే..

» ప్రాజెక్టులో నామమాత్రంగా వరద నీటి చేరిక » ఆందోళనలో ఆయకట్టు రైతులు » మిషన్ భగీరథ కేటాయింపుల కంటే తక్కువగా నీటి నిల్వ
» వరి నాట్లు వేసే విషయంలో రైతుల తర్జనభర్జన » ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు » ప్రస్తుత నీటి మట్టం 355.7 మీటర్లు


గడ్డెన్నవాగు ప్రాజెక్టు

భైంసా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరుణ దేవుని కరుణ లేక గడ్డెన్న వాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర రోజులు దాటినా సరైన వర్షాలు కురియలేదు. దీంతో ప్రాజెక్టులోకి అంతంత మాత్రంగానే వరద చేరింది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు ప్రాజెక్టులో కేవలం 0.157 టీఎంసీల నీరు మాత్రమే చేరింది. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు నాట్లు వేసే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. బోరుబావుల కింద నాట్లు కొనసాగుతున్నాయి. వానకాలపు సీజన్‌లో ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో 8 వేల ఎకరాలకు పైగానే సాగవుతుంది ఆయకట్టు లక్ష్యం 14 వేల ఎకరాలుగా ఉన్నప్పటికీ 42 కి.మీ. మేరనున్న ప్రధాన కాలువ పూర్తిస్థాయిలో సీసీ అవ్వకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

తాగునీటి కేటాయింపుల కంటే తక్కువ నిల్వ

గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా నీటిసామర్థ్యం 1.83 టీఎంసీలుగా ఉంది. కాగా ప్రాజెక్టులోని నీటి నిల్వలతో ముథోల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. ఇందుకు నిత్యం 0.20 టీఎంసీల నీరు కేటాయిస్తున్నారు. మిషన్ భగీరథ కోసం 0.65 టీఎంసీల నీటిని కేటాయించగా 1.18 టీఎంసీల నీటిని ఆయకట్టుకు కేటాయించారు. అయితే ప్రస్తుత ప్రాజెక్టు నీటి మట్టం 355.7 మీటర్లు ఉండగా నీటి నిల్వలు 0.512 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలంటే ప్రాజెక్టు నీటి మట్టం 355.9 మీటర్లు, నీటి నిల్వలు 0.65 టీఎంసీలకు పైగానే ఉండాలి. ప్రస్తుతం నీటి నిల్వల మిషన్ భగీరథకు కేటాయించిన నిల్వల కంటే 0.138 టీఎంసీలు తక్కువగా ఉన్నాయి.


నాటుకు సిద్ధంగా ఉన్న వరినారు మడి


గడ్డెన్నవాగు ప్రాజెక్టులోని నీటి నిల్వ

15 మండలాల్లో లోటు వర్షపాతం

జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 173.3 మి.మీ. కాగా 141.3 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 19 మండలాల్లో నిర్మల్ అర్బన్, నిర్మల్‌రూరల్, కుభీర్, నర్సాపూర్(జీ) మండలాలు మినహా 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కుభీర్ మండలంలో సాధారణ వర్షపాతం 174.7 మి.మీ. ఉండగా 200.8 మి.మీటర్ల వర్షపాతం, నర్సాపూర్ (జీ)లో సాధారణ వర్షపాతం 170 మి.మీ. ఉండగా 185.6 మి.మీ. వర్షపాతం, నిర్మల్ అర్బన్‌లో 176.1 మి.మీ.కు గాను 228.5 మి.మీ., నిర్మల్‌రూరల్‌లో 177.2 మి.మీ.కు 185.7 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా 15మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఆగస్టు 15 నాటికి భూ సమస్యలను పరిష్కరించాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇబ్బంది రాకుండా చూడాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నిర్మల్‌టౌన్, జూలై22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయడం ద్వారా రాష్ట్రప్రజలు భూ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు సీఎస్ రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టిపెట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పేదవాడికి ఎలాంటి ఇబ్బంది కలుగకూడదని స్పష్టంచేశారు. వీసీలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రామారావు, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో రాజేందర్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్ గౌడ్, అంబాజీ శ్రీనివాస్, మోహన్ సింగ్, ఎక్సైజ్ అధికారి ఎంఏ రజాక్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై నిర్వహిస్తున్న ర్యాలీలో డీపీవో

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

దిలావర్‌పూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటిస్తే చాలావరకు వ్యాధులు మన దరిచేరవని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. 'సీజనల్ వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత' అనే అంశాలపై మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈర్యాలీలో భాగంగా వర్షాకాలం వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తత, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అవ గాహన ర్యాలీలలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, గ్రామ పంచాయతీ ఈవో చంద్రశేఖర్, ఏపీఎం సులోచన రెడ్డి, మహిళా సంఘాలు, ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య

ఘనంగా దాశరథి శత జయంతి వేడుకలు

భైంసా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహాకవి దాశరథి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల తెలుగు విభాగంలో ఆధ్వర్యంలో నిర్వహించి శత జయంతి వేడుకలను పురస్కరించుకొని దా శరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య మాట్లాడుతూ నిజాం పాలకుల చేతిలో స్వేచ్ఛా స్వాతంత్రాన్ని కోల్పోయి జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్న తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చి నిజాం పాలనపై అక్షర శరాలు సంధించి దిక్కార స్వరం వినిపించిన యోధుడు దాశరథి అని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరె రాజు, రామ్మోహన్, రఘునాథ్, భీంరావు, పవన్ కుమార్, పీ జీరెడ్డి, రవికుమార్, శంకర్, ఓంప్రకాష్, సంతోష్, విద్యార్థులున్నారు.

విద్యార్థులు కళాశాలకు ప్రతీరోజు హాజరుకావాలి

సారంగాపూర్,జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కళాశాలకు ప్రతీరోజు హాజరుకావాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరుశురాం జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి ఈ నేపథ్యంలో కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు కళాశాలకు హాజరై ఆన్‌లైన్‌లో చెప్పే ఎంసెట్ క్లాసులను వినాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా కళాశాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. శంకర్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఐక్య రైతు సంఘం ధర్నా


ఏవోకి వినతి పత్రం ఇస్తున్న ఐక్య రైతు సంఘం నాయకులు

నిర్మల్‌రూరల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి అవసరమైన డీఏపీ, యూరియా ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి, ఏవోకు వినతి పత్రం ఇచ్చినట్లు అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య, జిల్లా నాయకులు గోరేభాయ్, గంగారాం, సాప్ రాజు, నాందేవ్, నగేష్, లింబరావు, శంకర్, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన

సారంగాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఓటింగ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో విద్యార్థులు ఓటింగ్‌ను నిర్వహించారు. దీంతో విద్యార్థులు ఓటింగ్ ఉపయోగించి ఓటింగ్ ద్వారా విద్యార్థుల నాయకురాలిని ఎన్నుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాథోడ్ అనూషతో పాటు ఉపాధ్యాయులున్నారు.


ఓటింగ్‌ను ఉపయోగించుకుంటున్న విద్యార్థులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి

- బీఆర్ఎస్ పార్టీ ముథోల్ ప్రతినిధులతో కేటీఆర్


నియోజకవర్గ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కేటీఆర్

భైంసా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా పార్టీ శ్రేణులన్నీ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధులకు ఆ పార్టీ అధినేత కేటీఆర్ సూచించారు. మంగళవారం పార్టీ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ సారథ్యంలో కుభీర్, కుంటాల, బాసర మండలాల పార్టీ అధ్యక్షులు అనిల్ కుమార్, పడకంటి దత్తు, గంగాశ్యామ్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిప్పెరవార్ కృష్ణలతో పాటు పలువురు ప్రతినిధులు హైదరాబాద్‌లో కేటీఆర్‌తో సమావేశమయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత నెలకొందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికస్థానాలు కైవసం చేసుకోవాలని సూచించారు. ఇదే క్రమంలో పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చే దిశగా ముందుకు సాగాలని తెలిపారు.


డ్రమ్ములో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న అధికారులు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఎంపీడీవో శివకుమార్

ముథోల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. మండలంలోని తరోడ గ్రామంలో మంగళవారం ఆయన పలువీధులను, డ్రైనేజీ, సీసీ రోడ్లు, మంచినీటి కుళాయిలు, ట్యాంక్‌లు పరిశీలించారు. నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని గ్రామస్థులకు తెలిపారు. మురికి నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు శుభ్రం ఉంచుకోవాలన్నారు. అలాగే వర్షపు నీరు టైర్లలో, గాజు పెంకులలో, పగిలిన కుండలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. చెత్త సేకరణ, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, డ్రైనేజీ నుంచి ప్లాస్టిక్‌ను తొలగించడం, బుష్ తొలగించడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వారానికి రెండుసార్లు డ్రై డే పాటించడం, నీరునిలిచి ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్ వేయడం, మలేరియా, డెంగ్యూ వంటివి నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో గురుచరణ్, కార్యదర్శి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ రేష్మ, సీసీ పోశెట్టి, తదితరులు ఉన్నారు.

సప్తమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కుభీర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజరాజేశ్వర ఆలయంలో కొనసాగుతున్న సప్తమి వేడుకలకు మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట నాయకులు వడ్నం నాగేశ్వర్, మోహన్, బోయిడి విఠల్, ప్యాట లక్ష్మణ్, చిన్నసాయినాథ్, బాలాజీసేట్, సంతోష్ సేట్, తదితరులు ఉన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి

- వామపక్ష విద్యార్థి సంఘాలు

నిర్మల్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంగాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, చంద్రగౌడ్‌కు బంద్ నోటీసు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద అశోక్

ప్రతిఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాలి

మావల/ ఆదిలాబాద్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు జాతీయ జెండాను గౌరవించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద అశోక్ పేర్కొన్నారు. జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో బంగారి గూడా ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు జాతీయ పతాక విశిష్టతపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బాల్య దశ నుంచే దేశ భక్తి, క్రమ శిక్షణ జాతీయ భావాలను అలవార్చుకోవాలన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు గంగదేవి, లయన్స్ క్లబ్ జనరల్ సెక్రెటరీ భగవండ్లు, ప్రేమ్ రాజ్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, ప్రశాంత్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సుంకిడిలో ఎక్సైజ్ శాఖ అధికారుల దాడులు

తలమడుగు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామంలో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ ఉంచిన తెల్ల కాలు దుకాణంపై దాడులు నిర్వహించి కేసు నమోదు చేసి జైలుకు తరలించడం జరిగిందని ఎక్సైజ్ శాఖ సీఐ విజయేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన ముత్యంపేట బాబా గౌడ్ అనే వ్యక్తి వద్ద 40 లీటర్ల అనధికార తెల్ల కల్లు అనధికారికంగా విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. బాబా గౌడు గతంలోనూ రెండుసార్లు పట్టుపడడం జరిగిందని తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి జిల్లా జైలుకు తరలించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా కలు విక్రయిస్తే బాధ్యులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా క్లోరైడ్ హైడ్రేడ్ ఇతర హాని కార రసాయనాల మందులు మందులు కలిపి కలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో ప్రొఫెషనల్ ఎక్సైజ్ శాఖ అధికారులు అక్బర్ హుస్సేన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ నగేష్

ఆదిలాబాద్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ గోడం నగేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల గురించి మంత్రితో చర్చించగా.. ఆయన సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కాజీపేట్ నుంచి హౌరా వయా మంచిర్యాల కాగజ్ నగర్ కొత్తగా రైలు, ఆదిలాబాద్‌లోని ఎల్.సీ నెం.29, 30, నామెన్కలేచర్ మార్పు గురించి, అలాగే ఆదిలాబాద్ దగ్గర మరో ఆర్‌ఓబీతో పాటు.. కాగజ్ నగర్‌లో వందే భారత్ స్టాప్ గురించి ఎంపీ చర్చించారు.

'ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయండి'

బోథ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే ధ్యేయంగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపి కార్యాలయంలో స్థానిక ఎన్నికల సమాయత్త సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని ప్రజలకు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి.రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

25న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నేరడిగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నేరేడిగొండ మండల కేంద్రంలో గల రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు ఏఈ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్, బజార్హత్నూర్ మండలాల విద్యుత్ వినియోగదారులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 25న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నందు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతున్నందున పైన తెలిపిన మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖపరమైన సమస్యలు పరిష్కరించుకోగలరని ఏఈ కోరారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు : సీఐ

నార్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని అమాయక ప్రజల వద్ద డబ్బులు వసులు చేస్తే కఠిన చర్యలు తప్పవని నార్నూర్ సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. గాదిగూడ మండలానికి చెందిన బాధితుడు భీం రావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాంపల్లి సంతోష్ అనే వ్యక్తి ఆదిలాబాద్ ఎమ్మెల్యే మనిషిని అని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఏడాది క్రితం రూ.50 వేలు వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం రాకపోవడంతో మోసాన్ని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. అక్రమ వసూళ్లు, మోసపూరిత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

తలమడుగు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆత్మ రక్షణ కోసం బాలికలందరూ కరాటే నేర్చుకోవాలని ఎస్ఐ రాధిక కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ద్వారా పాఠశాలలోని బాలికలకు జ్వాల అనే కార్యక్రమం ద్వారా ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్పాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో 10 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్ రావ్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు చంద్రమ్మ, వెంకటేశ్వర్, వినోద్‌రెడ్డి, మురళీధర్, రాకేష్, రాజేందర్, రవీంద్రకుమార్, నగేష్ ఆటాల్లాఖాన్, స్వప్న, నర్సయ్య, శ్రీనివాస్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బోరంచు శ్రీకాంత్‌రెడ్డి జన్మదినం

మావల, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆయన నివాసంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణుల నడుమ భారీ కేక్‌ను శ్రీకాంత్ రెడ్డి కట్ చేశారు. తమ అభిమాన నాయకుడికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు రైతు, కుల, రాజకీయ, ప్రజా, ఉద్యోగ సంఘాల నేతలు కలిసి కేక్ తినిపించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచా పేల్చి బ్యాండ్ మేళా మధ్య అభిమానులతో సంబరాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో టిపిసిసి ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క పాల్గొని శ్రీకాంత్ రెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఎన్నో ఉన్నత పదవులు పొంది రాజకీయంగా రాణించాలని ఆశీర్వదించారు. వేడుకల్లో జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, ముఖ్య నేతలు, యువజన కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, ఎన్ఎస్‌యూఐ అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగ, రాజకీయ, కుల, పెద్దఎత్తున హాజరయ్యారు.



నాయకులు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఈశ్వర్‌నగర్‌లో డిజిటల్ హెల్త్ కార్డు ట్రయల్ రన్

ఇంద్రవెల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈశ్వర్ నగర్ గ్రామాన్ని జిల్లా ఎన్సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లివార్ మంగళవారం సందర్శించారు. గ్రామంలో డిజిటల్ హెల్త్ కార్డుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే డిజిటల్ హెల్త్ కార్డు పథకానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టు (ట్రయల్ రన్)లో భాగంగా జిల్లాలోని 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీఎస్) పరిధిలో ప్రతి పిహెచ్సీకి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, నూతన ఎన్‌సీడీ స్క్రీనింగ్ యాప్ ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ స్క్రీనింగ్‌లో బిపి, షుగర్ వంటి జీవాణుల లక్షణాలతో పాటు, మానసిక ఆరోగ్యం, పాలియేటివ్ కేర్, వృద్ధాప్య సంబంధిత సమస్యలు, మూడు రకాల క్యాన్సర్లపై పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి వ్యక్తికి సంబంధించి ఖచ్చితమైన సమాచారం నమోదు చేయడం ఎంతో కీలకమని, ఆరోగ్య కార్డు పథక విజయానికి ఇది మెరుగైన పునాది అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పూజిత, జిల్లా ఎన్సీడీ కోఆర్డినేటర్ వెంకటరమణ, డేటా మేనేజర్ శివప్రసాద్, ఎన్సీడీ క్లినిక్ కోఆర్డినేటర్ సిమ్మికుమారి, హెల్త్ హెచ్ఈవో రాథోడ్ గోకుల్, సూపర్‌వైజర్లు అశోక్, సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ పూజ, ఏఎన్‌ఎంలు సేవంత, చంపాబాయి తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ కార్డుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అశ్రునయనాల మధ్య సైనికుడి అంత్యక్రియలు

● జాతీయ జెండాలతో భారీఎత్తున తరలివచ్చిన యువకులు ● ఇచ్చోడ నుంచి స్వగ్రామం వర్తమన్నూర్ కొనసాగిన ర్యాలీ

ఇచ్చోడ/ బజార్‌హత్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరి హృదయాలు బరువెక్కిపోయాయి. అస్సాం రాష్ట్రంలో రైఫిల్స్ విభాగంలో జీడీగా విధులు నిర్వహిస్తున్న సలువాల ఆకాష్‌కు(23) కన్నీటి నివాళి అర్పించారు. బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామం కన్నీటి సంద్రంగా మారింది. అస్సాం రాష్ట్రంలో జీడీగా విధులు నిర్వహిస్తున్న ఆకాష్ ఆదివారం విధుల్లో భాగంగా నిర్వహించిన పరుగులో అస్వస్థతకు గురై మృతి చెందాడు. జవాన్ పార్థివదేహం స్వగ్రామానికి వస్తుందని తెలుసుకున్న ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలంలోని చుట్టు పక్క గ్రామాల యువకులు పెద్దఎత్తున హాజరై ఇచ్చోడలోని షార్ప్ గార్డెన్స్ నుంచి వర్తమన్నూర్‌లోని జవాన్ స్వగృహం వరకు జాతీయ జెండాలతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కుటుంబానికి దూరంగా వెళ్లి దేశ సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టమని వీధులు నిర్వహిస్తూ మృతిచెందడం బాధకరమన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని కుటుంబసభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది. జవాన్ అంత్యక్రియలకు ఆయా పార్టీల నాయకులు, అధికారులు, యువకులు పెద్దఎత్తున హాజరై అంతిమ వీడ్కోలు పలికారు.



ఆర్మీ జవాన్ అంతిమ యాత్రలో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు

● ఆర్మీ జవాన్ మృతి బాధాకరం : ఆడె

నేరడిగొండ: బజార్‌హత్నూర్ మండలం వర్తమాన్నూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ ఆకాశ్ మృతి చెందడం చాలా బాధాకరమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం ఆకాశ్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం జవాన్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జవాన్ కుటుంబానికి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ముఖ్యమంత్రితో మాట్లాడి జవాన్ కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

బైక్ ఒకరిది.. ఫైన్ మరొకరికి

● పోలీసుల టార్గెట్‌తో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న వాహనదారులు

సిరికొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఇచ్చిన టార్గెట్‌తో వాహనదారులు తమ పొలాల్లోకి, ఇతర చిన్న చిన్న పనులకు ఊరిలో తిరగాలంటే రైతులు, వాహనదారులు బెంబెలెత్తిపోతున్నారు. రాంగ్ పార్కింగ్ అంటూ ఫోటోలు కొట్టి ఫైన్లు వేస్తున్న పోలీసులు వాటిని ఈ చలాన్ సైట్‌లో అప్‌లోడ్ చేస క్రమంలో తప్పులు చేస్తున్నారు. దీంతో ఒక బైక్‌కి పడాల్సిన ఫైన్ ఇంకో బైక్‌కి పడుతోంది. టీఎస్01 ఈజే 3088 నెంబర్ గల బైక్ సిరికొండ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రవిందర్‌ది. ఈనెల 11న ఓ ఇంటి వద్ద పోలీసులు ఫైన్ వేసినట్లు ఆయనకు మెసెజ్ వచ్చింది. దీంతో ఆయన ఈ-చలాన్ సైట్‌లో చెక్ చేయగా.. పోలీసుల తప్పిదంతో వేరే పల్సర్ బైక్‌కి పడాల్సిన ఫైన్ ఇతని బైక్‌కి పడినట్లు తెలిసింది. రాంగ్ పార్కింగ్‌తో పాటు వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ లేనట్లు ఫైన్ విధించారు. ఆన్‌లైన్‌లో చెక్ చేయగా రవీందర్ బైక్ రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి ఉండగా ఈ క్రింద న్న పల్సర్ బైక్ రోడ్డుపై ఉన్న ఫోటో కనిపించింది. టీఎస్ 01 ఈఎస్ 7569నెంబర్ కలిగిన పల్సర్ బైక్ సిరికొండ మండల కేంద్రానికి చెందినదిగా అతను గుర్తించాడు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి, హెల్మెట్ ధరించని వారికి, లైసెన్స్ లేని వాహనచోదకులకు విధించాల్సిన ఫైన్ పోలీసుల తప్పిదం వల్ల ఇతరులకు పడాల్సిన ఫైన్ రవీందర్‌కు పడడంతో కంగు తిన్నాడు. పని నిమిత్తం తాను ఓ వ్యక్తి ఇంటి వద్ద రోడ్డు పక్కన పార్కింగ్ చేసి వెళ్తితే.. కనీసం సమాచారం ఇవ్వకుండానే రాంగ్ పార్కింగ్ తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేనట్లు ఫైన్ వేశారన్నారు. తనకు డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి తనకు వేసిన ఫైన్‌ను తొలిగించాలని కోరారు.





1) ఆన్‌లైన్‌లో రాంగ్ పార్కింగ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేనట్లు విధించిన ఫైన్

2) రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన రవీందర్ బైక్

జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతి

నిర్మల్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చినటువంటి రైతు హామీలను అమలు పరచకుండా మోసగిస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు అధ్యక్షులు ముత్యం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి లింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా ఇన్‌చార్జి ఎస్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు అవుతున్నాగాని ఏఒక్క హామీని నెరవేర్చకుండా రైతులతో చెలగాటమాడటం శోచనీయమని తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ అందరికీ చేస్తామని చెప్పి కేవలం 60 శాతం మందికి మాత్రమే చేసి మిగతా 40 శాతం మందిని కుసుమ అనిపించిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందని, అలాగే పంటలు నష్టపోతే రైతులు నష్టపోవడం జరుగుతుందన్న ఉద్దేశంతోనే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తే దానిని రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఇంప్లిమెంట్ చేయలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్, భారతీయ జనతా పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు మేడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్, సోన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా భవాని పండుగ

పెంబి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంబి తండా, ఇటిక్యాల్ తండా, లోతర్య తండా, తాటి గూడ, పుల్గంపాండ్రి గ్రామాల్లో సీత్లా భవాని పండుగ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రితీష్ రాథోడ్ హాజరయ్యారు. గిరిజనులు ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగకు అత్యంత ప్రాముఖ్యత ఉందని, గ్రామాల్లో పాడి పంటలు పండాలని గిరిజనులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రజలు, పశుపక్షాదులు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు కురవాలని గిరిజన మహిళలు, యువతులు సీత్లా భవానికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్, నాగేష్, భూక్యా శ్రీనివాస్, భూక్యా రాజు, రాంసింగ్, తదితరులు ఉన్నారు.

డెంగీ లక్షణాలున్న ప్రాంతంలో శానిటేషన్

నిర్మల్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ కాలనీలో డెంగీ లక్షణాలున్న ప్రాంతంలో శానిటేషన్ చేసినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. డెంగ్యూ లక్షణాలు ఉన్న పాప శాంపిల్స్‌ని సేకరించి పరీక్షించినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

'నేడు విద్యా సంస్థల బంద్'

ముథోల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఈ నెల 23న వామపక్షాల విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయని, ఈ బంద్‌కు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు సహకరించాలని ఏఐపీఎస్‌యూ కార్యదర్శి పరుశురాం ఒక ప్రకటనలో కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా కాలం వెల్లదీస్తోందన్నారు.

'ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి'

భైంసా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులన్నీ కార్యోన్ముఖులుగా కావాలని బీజేపీ భైంసా మండల ఎన్నికల ఇంచార్జీ చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో వ్యవహరిస్తూ సమష్టిగా కృషి చేస్తూ ఎన్నికల పోరుకు సన్నద్దం కావాలన్నారు.

వర్షం కోసం గ్రామంలో పూజలు

ముథోల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చించాల గ్రామంలో మంగళవారం గ్రామస్థులు గ్రామ దేవతలకు గంగాజలంతో జలాభిషేకం చేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. గ్రామాల్లోని గ్రామ దేవతలకు భాజాభజంత్రీలతో వెళ్లి గంగాజలంతో జలాభిషేకం చేసిన అనంతరం స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గ్రామాల వద్ద ఆధార్ కార్డ్ లేని వారి సర్వే

నార్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు లేని కుటుంబాల సర్వేనీ పకడ్బందీగా అధికారులు నిర్వహిస్తున్నారని ఎంపీవో సాయి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని ముక్తాపూర్ కొలాం గూడ, సుంగాపూర్, చోర్ గావు, ఖడ్కి తదితర గ్రామాల వద్ద పంచాయతీ కార్యదర్శి వెళ్లి పూర్తి వివరణ సేకరించి అట్టి సమాచారాన్ని మీ సేవ కేంద్రాల దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన రౌడీ షీటర్ దిలీప్ సింగ్ శకావత్‌పై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. న్యాయస్థానం అనుమతితో ఆయనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పోలీసు విధులకు ఆటంకపరిచే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. ఎస్సై విష్ణు ప్రకాష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరిపి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

కుభీర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలేగాం, నిగ్వా, పల్సి, కుభీర్, పార్డి(బి) ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీవి రమణారావు మాట్లాడారు. రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు సంగి రాజేశ్వర్, మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బారే శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గంగారాం, మండల అధ్యక్షులు ఎల్. అరవింద్, మండల ప్రధాన కార్యదర్శి సిందే దత్తాత్రి, మండల కార్యవర్గ సభ్యులు, తదితరులున్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

కుంటాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణ యజమానులు ఎరువుల నిల్వలు, విక్రయాలు రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని తహసీల్దార్ కమల్ సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల ఎరువుల దుకాణం డీలర్లతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బందులకు గురిచేయకూడదన్నారు. కార్యక్రమంలో డిటి నరేష్ గౌడ్,తో పాటు పలువురు ఎరువుల దుకాణ యజమానులు ఉన్నారు.

'ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి'

కుంటాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో వనజ అన్నారు. మంగళవారం మండలంలోని విట్టాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణం పనులు వేగవంతం చేస్తే ఎప్పటికప్పుడు బిల్లులు అందించేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్దిదారులకే కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈమె వెంట ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, మాజీ సర్పంచ్ గల్లాపురం రమేష్, తదితరులు ఉన్నారు.

మళ్లీ.. అదే నిర్లక్ష్యం!!

(5వ పేజీ తరువాయి...)

చుట్టూ కంచెను ఏర్పాటు చేయక పోవడంతోనే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. వానాకాలంలో జలపాతాల వద్ద జరజాగ్రత్తగా ఉండాలని స్థానికులు చెబుతున్నారు.

కనిపించని హెచ్చరిక బోర్డులు

జలపాతాల వద్ద అడుగడుగునా మళ్లీ అదే నిర్లక్ష్యం కనిపిస్తుంది. కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయక పోవడంతో పర్యాటకులు ప్రమాదాల భారీన పడుతున్నారు. అభివృద్ధి పేరిట అటవీ శాఖ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పర్యాటకుల నుంచి కొంత ఫీజును వసూలు చేస్తున్న కనీస సౌకర్యాలు మాత్రం కలిపించడం లేదని పర్యాటకులు వాపోతున్నారు. జలపాతాలను ఆధునికీకరించి అభివృద్ధి చేస్తే పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం కనిపిస్తుంది. కానీ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో జలపాతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాను తెలంగాణ కాశ్మీర్‌గా తీర్చిదిద్దుతామని పలుమార్లు హామీలు ఇచ్చిన ఆచరణ సాధ్యం కాలేదు. గతంలో అటవి శాఖ మంత్రిగా పని చేసిన జోగు రామన్న హయాంలోనూ కుంటాల జలపాతాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు జరిగిన అది సాధ్యపడక పోవడంతో నిర్లక్ష్యంగానే వదిలేశారు. ప్రమాదకరంగా మారి కనిపిస్తున్న జలపాతాల వద్ద ఆధునికీకరణ పనులతో పాటు భద్రత చర్యలు చేపట్టాల్సి ఉన్న అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. బోథ్ నియోజక వర్గంలోనే ప్రధానంగా జలపాతాలు ఉన్నా వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. ముఖ్యంగా రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరుగాంచిన కుంటాల జలపాతంపై నిండు నిర్లక్ష్యమే కనిపిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడే అధికారులు హడావిడి చేస్తున్నారే తప్ప ఆ తర్వాత అసలు జలపాతాల ఊసేత్తినట్లే కనిపించడం లేదు. రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పర్యాటకుల తాకిడి పెరుగుతున్న సౌకర్యాలను కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య

దిలావర్‌పూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయపూర్ గ్రామానికి చెందిన కామిండ్ల భీమన్న(40) తనకున్న ఒక ఎకరం భూమిని సాగు చేసుకుంటూనే కొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. భీమన్నకు ఇద్దరు కూతుళ్లు, ఒక అబ్బాయి. కాగా వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు చేసినా సరైన దిగుబడులు రాక నష్టపోయాడు. రెండు నెలల క్రితం మరికొంత అప్పు చేసి తన పెద్ద కూతురు సంధ్య వివాహం చేశాడు. తిరిగి ఖరీఫ్ సాగుకు అప్పు దొరకకపోవడం, గతంలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నాడు. అప్పులు ఎలా తీర్చాలన్న బెంగ ఆయన్ని తీవ్రంగా వెంటాడింది. ఇదే విషయాన్ని భార్యతో చెబుతూ బాధ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి భోజనం చేసిన భీమన్న బయటకు వెళ్లి వస్తానని తన భార్య సునీతకు చెప్పి వెళ్లాడు. ఎంతకు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు భీమన్నను వెతుకుతూ పొలానికి వెళ్లి చూడగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ భీమన్న మృతి చెందాడు. కాగా భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువ రైతు దుర్మరణం

భైంసా, జూలై 22(ఆంధ్రజ్యోతి): భైంసా-బాసర ప్రధాన రహదారి మార్గంలోని దేగాం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువ రైతు ఒకరు దుర్మరణం పాలయ్యారు. ముథోల్ మండలం ముద్గల్ గ్రామానికి చెందిన యువ రైతు మహిపాల్(27) ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి భైంసాకు వస్తుండగా, భైంసా నుంచి ముథోల్ వైపు వెలుతున్న కారు దేగాం-నరస్వతీనగర్ గ్రామాల మధ్య ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో బైక్‌పై వస్తున్న మహిపాల్ తలతో పాటు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలవ్వడంతో ప్రమాద స్థలిలోనే దుర్మరణం పాలయ్యాడు. మృతునికి భార్యతో పాటు 7 నెలల వయస్సు గల కుమారుడున్నారు. మహిపాల్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. భైంసా రూరల్ ఎస్ఐ శంకర్ మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేపట్టారు.

● రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు..

బోథ్: మండల కేంద్రానికి చెందిన మల్యాల శశికాంత్(24) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో గాయాల పాలైన యువతితో పాటు యువకుడిని ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే అదిలాబాదులో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందగా యువతి మాత్రం తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్నారు. అయితే చికిత్స పొందుతూ సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు సమాచారం అందింది. పుట్టిన రోజు చనిపోయాడు.. మృతుడు జన్మదినం రోజే మృత్యువాత పడడం అందరిని కలిసివేసింది. మిత్రులతో జన్మదిన వేడుకలను ఈరోజు రాత్రికి జరుపుకుందామని మాట ఇచ్చినట్లు మిత్రులు పేర్కొంటున్నారు. జన్మదిన వేడుకలు జరుపుకోవాలని మిత్రుడు మృత్యువాత పడడంతో విషాదం అలుముకుంది. మృతుని స్వగ్రామమైన బోథ్ పట్టణంలోని బంధువులలో విషాదం అలుముకొనగా ఆయన కుటుంబీకులు శోకసముద్రంలో మునిగిపోయారు.

లారీ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఒక వ్యక్తి కోసి కారణమైనా లారీ డ్రైవర్‌కు ఏడు సంవత్సరాల కారాగార జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ న్యాయాధికారి సిఎమ్ రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. జైనథ్ మండలం బాలాపూర్ గ్రామానికి చెందిన బాధితుడు సెనగరపు రవి 2022 ఏడాది మే 15న మధ్యాహ్నం తన మోటార్ సైకిల్‌పై ఆదిలాబాద్ నుంచి బాలాపూర్ వెళ్తుండగా.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ బల్బీందర్ సింగ్ లారీని అతి వేగంగా, అజాగ్రత్తతో నడిపి ప్రమాదానికి కారణమయ్యాడు. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడి రిమ్స్‌కు వెళ్లే క్రమంలోనే మృతి చెందాడు. డ్రైవర్ ను అరెస్ట్ చేసి పరీక్షలు జరిపిన పోలీసులు.. డ్రైవర్ మద్యం సేవించినట్లు గుర్తించారు. అప్పటి జైనథ్ ఎస్సై పెర్సిస్ కేసు నమోదు చేయగా.. సీఐ కె నరేష్ కుమార్ విచారణ జరిపి చార్జ్ షీట్ దాఖలు చేశారు. లైజన్ ఆఫీసర్ జి.పండరి, కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి ఎంఎ జమీర్ 15 మంది సాక్షులను కోర్టులో హాజరు పరచగా పీపీ సహీన్ సుల్తన నేరం రుజువు చేయించారు. ఈ మేరకు సీనియర్ సివిల్ న్యాయాధికారి డ్రైవర్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. నిందితుడికి శిక్ష పడడంలో, సాక్షులను ప్రవేశ పెట్టడంలో, కేసు విచారణలో కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పోలీసులకు అనుమానితుల అప్పగింత

ఇంద్రవెల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భీంనగర్‌లో సోమవారం రాత్రి సుమారు 10 గంటలకు అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళలు, ముగ్గురు వ్యక్తులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా కాలనీలో కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు వారిని ప్రశ్నించడంతో సమాధానాలు చెప్పలేక పోయారు. దీంతో వారిని కిడ్నాపర్లుగా భావించి స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయారు. కాలనీకి చెందిన యువకులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

'విద్యుత్ సమస్యను పరిష్కరించాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల నుంచి తమకు కరెంట్ సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలని సాత్నాల మండలం పలాయి తండ గ్రామస్తులు కోరారు. మంగళవారం గ్రామస్తులు ఎస్ఈ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ జేఆర్ చౌహన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఉదయం కరెంట్ ఉంటుందని, రాత్రి సమయంలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సర్వే చేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చీఫ్ ఇంజనీర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆస్తక్ సుభాష్, దినేష్, సురేష్, సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● రైతులకు తప్పని విద్యుత్ కష్టాలు

నార్నూర్: పంట పొలాలకు నెల రోజులు నుంచి విద్యుత్ అంతరాయం ఉందని, ఈ విషయాన్ని మండల విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన రైతులు శేషారావు, పరుశురాం రాథోడ్ ఆరోపించారు. నందన్ వరే పొలాలకు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా దాదాపుగా ఇరువై మంది రైతులకు కరెంట్ సరఫరా ఉంది. వానా కాలం వర్షాలు సరిగా పడలేక కనీసం బోరు బావి నీటిని పంటలకు ఇద్దామన్న కరెంట్ లేదు. సంబంధిత అంశాలు అధికారులకు చెప్పిచెప్పి అల్సిపోయామని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రైతులను కాపాడాలని వారు కోరారు.

నాడు వెల వెల.. నేడు కళ కళ

● నిండుకుండలా మత్తడి ప్రాజెక్టు

తాంసి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఇరవై ఐదు రోజుల క్రితం వరకు ఎడారిగా కనిపించిన ప్రాజెక్టులోకి ఒక్కసారిగా భారీ గా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు పక్షం రోజుల్లోనే నిండుకుండలా తయారైంది. తాంసి మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు. ప్రస్తుతం 276.40 మీటర్లకు చేరుకుంది. సుమారు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చుక్క నీరు లేకుండా పూర్తిగా వట్టిపోయిన ప్రాజెక్టు ఈ ఏడు నిండుతుందో లేదో అని అనుమానపడ్డ జనానికి ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తుంది.


ఇరవై ఐదు రోజుల క్రితం ఎడారిగా కనిపించిన ప్రాజెక్టు

ఫొటో న్యూస్


పక్షం రోజుల క్రితం కొద్దిపాటి నీరు వచ్చిన దృశ్యం


ప్రస్తుతం నిండుకుండలా కనిపిస్తున్న ప్రాజెక్టు



పంచాయతీలు, వార్డులకు కొత్త ఓటర్ల జాబితా

- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశం
- చర్యలు చేపట్టిన పంచాయతీరాజ్ శాఖ

భైంసా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితా రానుంది. ఇందుకు సంబంధించి మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ అధికార యంత్రాంగం కొత్త ఓటర్ల జాబితా రూప కల్పనకు చర్యలు చేపట్టింది. పంచాయతీలు, వార్డుల సంఖ్య మరింత పెరుగుతున్నందున పూర్తి స్థాయి సమాచారంతో పక్కా ఓటర్ల జాబితాను తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన విషయంలో పంచాయత్‌రాజ్ శాఖాధికారులు ఆయా మండలాల ఎంపీడీవోలకు దిశనిర్దేశం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో బాగంగా పంచాయతీ కార్యదర్శి స్థాయిలో గ్రామం యూనిట్‌గా తీసుకుని వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించనున్నారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను తయారు చేసి నేరుగా ఎంపీడీవో లాగిన్ ద్వారా టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో చేర్చారు. కాగా రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీలు, వార్డుల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి వినతులు వస్తుండగా, దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాలు, వార్డుల్లో ఓటర్ల సంఖ్య మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో టీపోల్ వెబ్‌సైట్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేసి మళ్లీ మొదటి నుంచి ఓటర్ల జాబితా ప్రక్రియను చేపట్టనున్నారు.

జిల్లాలో ప్రస్తుత ఓటర్లు . 4,46,219

జిల్లాలోని 18 మండలాల్లో 2,33, 687 మంది మహిళా ఓటర్లు, 2,12, 517 మంది పురుష ఓటర్లు, 15 మంది ఇతరులను కలుపుకొని మొత్తం 4,46,219 మంది ఓటర్లున్నారు. ఇక జిల్లాలోని 18 మండలాల్లో 400 గ్రామ పంచాయతీలు, 3,368 వార్డులున్నాయి. పంచాయతీ ఎన్నికల కోసంగాను అధికార యంత్రాంగం జిల్లా పరిధిలో మొత్తం 3,368 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 200 ఓటర్లలోపు ఉన్న పోలింగ్ కేంద్రాలు 2,889 ఏర్పాటు చేయగా, 201 నుంచి 400 మంది వరకు ఓటర్లు ఉన్న వాటికి 435 పోలింగ్ కేంద్రాలు, 401 నుంచి 65 మంది వరకు ఉన్న ఓటర్ల కోసం 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన జరుగనుండటంతో ఓటర్ల సంఖ్య పెరుగనుంది.


ఓటర్ల జాబితా

'ఉల్లాస్'ంగా..

దేశంలోని ప్రతి మారుమూల పల్లెల్లో సైతం నిరక్షరాస్యతను తొలగించి అక్షర దీపాన్ని వెలిగించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నవ భారత సాక్షరతకు శ్రీకారం చుట్టింది. నా నాటికి సమాజంలో అక్షర సహకారం లేకుండా ఏ పనిలో కూడా అడుగు ముందుకు పడని పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చింది.



- అక్షరాస్యత వైపు వయోజనుల అడుగులు
- నవ భారత్ సాక్షరతకు శ్రీకారం
- జిల్లాలో ఇప్పటికే సర్వే పూర్తి
- లక్ష్యం 31,333 మంది
- యాప్‌లో 32,881 మంది వివరాల నమోదు

ఖానాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఉల్లాస్ నవ భారత్ సాక్షరత పథకం రూపొందింది. 15 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం దీని లక్ష్యం. ఓవైపు నిరక్షరాస్యుల సంఖ్యను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయడమే కాకుండా వారికి అక్షరాలు నేర్పే వలంటరీ టీచర్ల వివరాలను సైతం ఉల్లాస్ యాప్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది.

లక్ష్యానికి మించి ఆన్‌లైన్ నమోదు పూర్తి..

ఉల్లాస్ నవ భారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లాలో 31,333 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి టార్గెట్ విధించింది. జిల్లాలో స్వ యం సహాయక సంఘాల ద్వారా ఐకేపీ సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు. టార్గెట్‌కు మించి నిర్లక్షరాస్యులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాలో 32,881 మంది నిర్లక్షరాస్యుల వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు పూర్తి చేశారు.

స్వచ్ఛంద వలంటీర్లు..

ఉల్లాస్ నవ భారత్ సాక్షరతలో బాగంగా జిల్లాలో గుర్తించిన నిర్లక్షరాస్యులకు చదవడం, రాయడం నేర్పేందుకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా వాలంటరీ టీచర్లను ప్రభుత్వం గుర్తించింది. విద్యావంతులైన యువతి, యువకులు తమ పరిసర ప్రాంతాలలోని ఓ పది మంది నిరక్షరాస్యులకు చదువు చెప్పేందుకు ముందుకు రావాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. జి ల్లా అధికార యంత్రాంగం ఈ వాలంటరీ టీచర్లను గుర్తించి వారి వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని సూచించింది. జిల్లా వ్యాప్తం గా మొత్తం 3,139 మంది వాలంటరీ టీచర్లు అవసరం ఉండగా ఇప్పటి వరకు 3,122 మంది వాలంటరీ టీచర్లు నిరక్షరాస్యులైన వయోజనులకు విద్యను నేర్పేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు చెబుతున్నారు.

ఆగస్టు 1 నుంచి విద్యాబోధన..

ఉల్లాస్ ద్వారా వయోజన విద్యాబోధన కార్యక్రమాన్ని ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభించాలని జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ నెల 31 లోపు వీటీలకు శిక్షణ పూర్తి చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 26వ తేదీన జిల్లా నుండి ముగ్గురు ఆర్పీలకు రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చి ఈ నెల 31వ తేదీన జిల్లా స్థాయిలో అన్ని మండలాల ఎమ్మార్పీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉచితంగా అక్షర క్రాంతి పుస్తకాలను ఇస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఈ నెల 31వ తేదీ లోపు పూర్తి చేసి ఆగస్టు 1వ తేదీ నుంచి వయోజన విద్యాబోధన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. వంద రోజుల్లోపు జిల్లాలోని నిరక్షరాస్యులైన వయోజనులకు రాయడం, చదవడం నేర్పాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



విద్యార్థులను సైతం ఉల్లాస్‌లో భాగస్వాములను చేస్తాం

- పి. రామారావు, జిల్లా విద్యాధికారి, నిర్మల్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ని ర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవం తం చేసేందుకు క్షేత్రస్థాయిలో విద్యార్థులను సైతం ఇందులో భాగస్వాములను చేస్తున్నాం. వీటీలే కాకుండా చదువుకున్న ప్రతీ చిన్నారి తమ తల్లిదండ్రులకు అక్షరాలను నేర్పాలని ఉపాధ్యాయులచే అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలలో నేర్చుకున్న అక్షరాలను ఇంటి కెళ్లి నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు చెప్పడం ద్వారా ఇటు విద్యార్థికి అటు తల్లిదండ్రులకు ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లాలో ఉల్లాస్ ద్వారా వయోజన విద్యను విజయవంతంగా నేర్పుతూ 100 రోజుల్లో ప్రతీ ఒక్కరికి రాయడం, చదవడం వచ్చేలా మా వంతుగా కృషి చేస్తాం.

పదో తరగతి పరీక్ష రాద్దామనుకుంటున్నా..

- అలుగుల శంకర్, సింగపూర్ గ్రామస్థుడు



కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఏడవ తరగతితోనే నాడు చదువును ఆపేశాను. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా చదువు లేనిదే పని జరగడం లేదు. దీంతో ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో చదువుకొని పదవ తరగతి పరీక్ష రాద్దామనుకుంటున్నారు.

నా కూతురే నాకు చదువు నేర్పుతోంది..

- రాయనవేని విజయ, సత్తెనపల్లి



ప్రస్తుతం ప్రభుత్వాలు చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంతో చదువు రాని మా లాంటి వాళ్లను చదువుకోవాలని అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛందంగా వాలంటరీ టీచర్‌గా ముందుకొచ్చిన నా కూతురు నాతో సహా మరో పది మందికి చదువు నేర్పుతోంది. ఇన్నాళ్లు చదువు రాక ఇబ్బంది పడ్డ మాకు ఇప్పుడు అక్షరాలు నేర్చుకోవడం ఆనందాన్నిస్తోంది.

వరుణ దేవా కరుణించవా..


బాసర గోదావరి నది జలాలను తీసుకెళ్తున్న రైతులు


పూజలు నిర్వహిస్తున్న మత్స్యకారులు

బాసర, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మేఘాలు వర్షించడం లేదు రైతుల పూజలు ఫుల్‌స్టాప్ పడడం లేదు. వరుణ దేవుడి కరుణ కోసం ఇంకా పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. బాసర మండలంలో రైతులు, మత్స్యకారులు మంగళవారం వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు అందరు మంగళవాయిద్యాలతో గోదావరి నది జలాలను తీసుకొచ్చి గ్రామంలో ఉన్న అన్ని దేవతామూర్తులను గంగాజలంతో అభిషేకించి పూజ నిర్వహించారు. వర్షాలు కురవాలని మొక్కుకున్నారు. మరోవైపు మత్స్యకారులు సైతం తమ సాంప్రదాయ రీతిలో చేపలు పట్టే వలతో శోభయాత్రగా వెళ్లి గోదావరి నది నీటిని తెచ్చి పూజలు చేశారు. జిల్లాలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నప్పటికీ బాసర ప్రాంతంలో గత కొన్ని రోజుల నుంచి వర్షాలు లేక పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. రెండు మూడు రోజుల్లో వర్షం కురవకపోతే పెద్ద ఎత్తున పంటలు నష్టపోయేలా ఉంది. గత్యంతరం లేక రైతన్నలు దేవుడిపైనే భారం వేసి పూజలు నిర్వహిస్తున్నారు.


తుమ్మ చెట్టుపై వాలిన కొంగలు

కొమ్మ కొమ్మకో.. కొంగ

దిలావర్‌పూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 61వ జాతీయ రహదారి పక్కనే ఉన్న లింగోజీ చెరువులో ఉన్న నల్ల తుమ్మ చెట్లను కొంగలు ఆవాసంగా చేసుకున్నాయి. పొద్దంతా ఆహారం కోసం వేటకు వెళ్లి సాయంత్రం కాగానే లింగోజీ చెరువులోని నల్ల తుమ్మ చెట్లపై వాలుతున్నాయి. కొమ్మ కొమ్మ కో... కొంగ కూర్చుండి ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. తుమ్మ చెట్లకు మల్లె పూజలు పూశాయా.. అన్నట్లుగా కనువిందు చేస్తున్నాయి. లింగోజీ చెరువులోని తుమ్మ చెట్లు వేలాది కొంగలకు ఆవాసంగా మారి ఆకర్షిస్తున్నాయి.

ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఖానాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్‌కు చెందిన ఎస్ఆర్ఆర్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని రంగపేట్ గ్రామంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ వైద్య శిబిరంలో ఎస్ఆర్ఆర్ దంత వైద్యశాలకు చెందిన దంత వైద్య నిపుణులు నితీష్ రాజా, డాక్టర్ యోగితా మహాజన్, డాక్టర్ భాగ్యలక్ష్మిలు పాల్గొని దంత సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ దంత వైద్య శిబిరానికి చుట్టుపక్క గ్రామాల నుంచి పలువురు హాజరై దంత పరీక్షలు చేయించుకున్నారు. కాగా హాజరైన వారిలో 120 మంది రోగులకు స్క్రీనింగ్ చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దంత సమస్యలతో బాధపడుతున్న రోగులకు దంత వైద్య నిపుణులు వైద్యం అందించడమే కాకుండా దంతాలు ఆరోగ్యకరంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు లక్ష్మణరావు, వాసవి క్లబ్ వైస్ గవర్నర్ జితేందర్ మహాజన్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, వీడీసీ బృందం కటకం శ్రీనివాస్, లింగారెడ్డి, మహాజన్ జలందర్ గుప్తా, తదితరులున్నారు.


. రంగపేట్‌లో దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దంత వైద్యులు


ఆయిల్ పామ్ సాగును పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ స్పందన

ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం కడెం నేలలు

కడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్, పాండ్వాపూర్, మద్దిపడగ గ్రామాల్లో నూతనంగా నాటిన ఆయిల్ పామ్ బంతి తోటలను హార్టికల్చర్ ఆఫీసర్ స్పందన సందర్శించారు. కడెం నేలలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని, దళారీ వ్యవస్థ లేక 24 గంటల్లో కొనుగోలు జరుగుతాయని తెలిపారు. నాలుగవ సంవత్సరం నుంచి 35 నుంచి 40 ఏళ్ల వరకు దిగుబడి ప్రతి 15 రోజులకు పంట వస్తుందన్నారు. ఆసక్తిగల రైతులు ఏఈవో నవీన్‌ను సంప్రదించాలని రైతులను కోరారు. .

ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తత అవసరం

సోన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, భారీవర్షాలు, పిడుగులు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులను రక్షించడానికి అప్రమత్తం గా ఉండాలని జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం అధికారి వినీత్ కుమార్ అన్నారు. మండలంలోని జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, యువత, గ్రామస్థులకు నిర్వహించిన అవగాహన, ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆకస్మిక వరదలు, అగ్ని ప్రమాదాలు, రహదారి ప్రమాదాల బారి నుంచి రక్షించుకునే పద్ధతులను ప్రదర్శించారు. నీట మునిగిన వ్యక్తిని రక్షించే విధానం, రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలి రక్తం వచ్చినప్పుడు, ఎముకలు విరిగి న సందర్భంలో చేసే ప్రథమ చికిత్సల గురి ంచిన ప్రదర్శనలు ఇచ్చారు. ఇంట్లో జరిగే అగ్ని ప్రమాదాల బారి నుంచి రక్షించుకోవడానికి తగిన జాగ్రత్తలను, పద్ధతులను అగ్నిమాపక అధికారి శివాజీ, వారి సిబ్బంది పలు ప్రదర్శనల ద్వారా వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్, ఉప తహసీల్దార్ జ్యోతి, ఎంపీవో కలీం, ఆర్ఐ జ్ఞానేశ్వర్, యువత నాయకుడు హరీష్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రేవతి, సభ్యులు, జాతీయ విపత్తు రక్షణ దళం సభ్యులు, అగ్నిమాపక సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఉన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విపత్తు ప్రతిస్పందన దళం అధికారి

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3 ׀ కనిష్ఠం 24.2



నేటి బంద్‌కు సహకరించాలి: టీఎస్ఎస్‌వో

ఉట్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తలపెట్టిన ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌కు విద్యా సంస్థల యజమాన్యాలు సహకరించాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్ ఒక ప్రకటనలో కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫీజులు విడుదల చేయాలని, బెస్ట్ అవైలబుల్ ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, అనుమతి లేని స్కూల్స్ పైన చర్యకు, విద్యాహక్కు చట్టం బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు.



బొండిందిలో ప్రత్యేక పూజలు చేస్తున్న గిరిజనులు

వైభవంగా సీత్లా భవాని వేడుకలు

నేరడిగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం సీత్లా భవాని వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు, పశువులు బాగుండాలని భవానీని వేడుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి వనదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, యువతులు, పిల్లలు డప్పు చప్పుళ్లతో సంప్రదాయకమైన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, గిరిజన మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆసక్తికరంగా సాగిన ఆదర్శ క్రీడా పాఠశాల ప్రవేశాల ఎంపిక

ఉట్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన ఎంపిక పోటీలు ఆసక్తిగా జరిగాయి. మంగళవారం మండల కేంద్రంలోని కొమురంభీం క్రీడా ప్రాంగణంలో ఎంపిక పోటీలను జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించారన్నారు. అదేవిధంగా విద్యతోను ముందున్నారని అన్నారు. రెండు రోజైనా బుధవారం జాతర్లలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బాలురకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉత్తమ్, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్‌నాయక్, ఇన్‌చార్జి వార్డెన్ మేస్రం గంగారాం, రవీందర్, కోచ్‌లు శివకృష్ణ, వై శేఖర్, విశ్వనాథ్, తదితరులున్నారు.

తుల్జాభవానిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): .మహారాష్ట్రలో ప్రసిద్ధిగాంచిన తుల్జాపూర్ తుల్జాభవాని ఆలయాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ఈనెల 26న తాము నిర్వహించే జాబ్ మేళాలో పెద్దమొత్తంలో నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాలు సాధించి ఉపాధి సాధించాలని కోరుకున్నారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

గిర్జాయి మాతకు ప్రత్యేక పూజలు

భీంపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజలా, గొల్ల గడ్ శివారు ప్రాంతంలో ఉన్న గిర్జాయి (పార్వతీ దేవి) ఆలయంలో మండలంలోని భీంపూర్, గుంజల, గొల్ల గడ్, మహారాష్ట్ర జమున నగర్, ఇవిరి, చిన్న ఆర్లి గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో మంగళవారం గిర్జాయి మాతకి ప్రత్యేక పూజలు చేశారు. దీనిలో భాగంగా పిండి వంటలు చేసి మాతకు సమర్పించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.

రాజ్ గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా పంద్రం శంకర్



ఆదిలాబాద్ టౌన్/ బోథ్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజ్‌గోండ్ సేవ సమితి జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది పంద్రం శంకర్‌ను స్టీరింగ్ కమిటీ నియమించారు. ఈనెల 27న రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎంపీ సోయం బాపూరావు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో అదే వేదికపై జిల్లా అధ్యక్షుడిగా పంద్రం శంకర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బోథ్ మండలంలోని పట్నాపర్ గ్రామానికి చెందిన న్యాయవాది పంద్రం శంకర్.. తనకు జిల్లా అధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజ్ గోండ్ సేవ సమితి స్టీరింగ్ కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి సమితిని తనవంతుగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

నేరడిగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఖాళీగా ఉన్న 20 సీట్లను స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించి, అర్హులైన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని నేరడిగొండ కేజీబీవీ పాఠశాలకు వచ్చి నేటి నుంచి అడ్మిషన్ పొందవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ రజిత సూచించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం. 9492700908ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇచ్చోడ, జులై, 22 (ఆంధ్రజ్యోతి) : అండర్-13 జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఇచ్చోడ మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలోని నాల్గవ తరగతికి చెందిన ఇషాన్, యాష్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్‌తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాల నుంచి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల కరస్పాండెంట్ గణేష్, రాకేష్, సంజయ్‌లు పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది



మళ్లీ.. అదే నిర్లక్ష్యం!

...జర జాగ్రత్త సుమీ

ఎత్తైన కొండల నడుమ.. జాలువారే నీటిపరవళ్లను అతి సమీపం నుంచి చూసేందుకు ఆరాటపడే క్రమంలో పర్యాటకులు ప్రమాదాల భారీన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అయినా అటవీ, పర్యాటక శాఖ అధికారులకు పట్టింపే లేకుండా పోతుంది. రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరుగాంచిన కుంటాల జలపాతంతో పాటు పొచ్చెర, గాయత్రి, కనకాయి జలపాతాల వద్ద కనీస భద్రత చర్యలు చేపట్టక పోవడంతో ప్రమాదకరంగా మారి కనిపిస్తున్నాయి. దీంతో ప్రతియేటా ప్రమాదాలు జరగడంతో పర్యాటకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈయేడు కూడా జలపాతాల వద్ద మళ్లీ అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది.

- జిల్లాలో జలపాతాల వద్ద కనిపించని భద్రతా చర్యలు
- వరద నీటితో పరవళ్లు పెడుతున్న జలపాతాలు
- రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్న పర్యాటకం
- జలపాతాల సందర్శనకు మొదలైన పర్యటకుల తాకిడి
- అధికారులు అప్రమత్తమైతేనే ఆపదలు దూరం



ఆదిలాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అటవి శాఖ మంత్రిగా పని చేసిన జోగు రామన్నతో పాటు రాష్ట్ర పర్యాటక, అటవీ శాఖ ఉన్నతాధికారులు కుంటాల జలపాతాన్ని సందర్శించి భద్రతా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అప్పట్లో రూ.10 కోట్ల నిధులతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. అయిన ఇప్పటి వరకు నిధులు మంజూరుకాక పోవడంతో పాటు కుంటాల జలపాతంతో పాటు ఇతర జలపాతాలు అభివృద్ధికి నోచుకోవడమే లేదు. గతంలో సహజ సిద్ధమైన జలపాతాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టవద్దంటూ కొందరు ప్రకృతి ప్రేమికులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.ముఖ్యంగా కుంటాల బచావో పేరిట ఉద్యమాన్ని చేపట్టారు. సహజ సిద్ధమైన ప్రకృతి అందాలను కాపాడే ప్రయత్నం చేశారు. ప్రతీసారి వానాకాలం సీజన్ మొదలు కావడంతో కుంటాల, పొచ్చెర, కనకాయి, గాయత్రి జలపాతాలకు పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. ప్రమాదమని తెలిసినా ప్రకృతి అందాలను చూసేందుకు పర్యాటకులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. కానీ అధికారులు ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు చేయడం లేదంటున్నారు. ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు అప్రమత్తమైతే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదకరంగా నీటి గుండాలు

నునుపైన బండరాళ్లపై జాలువారే నీటిపరవళ్లను చూసేందుకు పర్యాటకుల్లో ఆతృత కనిపిస్తుంది. ఈ క్రమంలో హడావిడిగా అడుగు జారిందంటే ఇక అంతే సంగతి. సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి గుండాల వద్ద ప్రతిసారి ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. నీటి గుండాల్లో జారిపడిన ఏ ఒక్కరు ఇప్పటి వరకు బ్రతికి బయట పడిన దాఖలాలు లేవు. లోతైనా నీటి గుండాల్లో పెద్ద పెద్ద బొరియలు ఉండడంతో ప్రమాదవశాత్తు పడిన వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రక్షించే ప్రయత్నాలు చేసిన ప్రాణాలు దక్కడం లేదు. గతంలో కుంటాల జలపాతం వద్ద ఉన్న నీటి గుండాల చుట్టు ఇనుప రాళ్లతో కంచెను ఏర్పాటు చేసిన వరద నీటికి కొట్టుకు పోవడంతో ప్రస్తుతం ఇనుప కంచె కనిపించకుండానే పోయింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు ముప్పుఉందని తెలియక ప్రమాదాల భారీన పడుతున్నారు. ఈ నీటి గుండాల్లో పెద్దపెద్ద బండరాళ్లను వేసి పూడ్చి వేసేందుకు ప్రయత్నాలు జరిగిన గిరిజన సాంప్రదాయానికి విరుద్ధమని కొందరు అడ్డుకోవడంతో అర్ధంతరంగానే పనులు నిలిచి పోయాయి. ఇక్కడే ఉన్న రాతిగుహలో కొలువుదీరిన సోమేశ్వర స్వామి శివరాత్రి పర్వదినాన ఈ నీటి గుండాల్లోనే స్నానం ఆచరిస్తాడని గిరిజనులు నమ్ముతుంటారు. ఈ కారణంగానే నీటి గుండాలను పూడ్చి వేయవద్దంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నీటిగుండాల

(తరువాయి 6వ పేజీలో...)

ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి

: జాదవ్ వసంత్‌రావు, బుగ్గారం గ్రామం, నేరడిగొండ మండలం



కుంటాల జలపాతం వద్ద ప్రమాదాలు జరుగకుండా అటవీ శాఖాధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అన్ని రకాల వసతులను కల్పించాలి. ముఖ్యంగా జలపాతం వద్ద నీటిగుండం వద్దకు పర్యాటకులను అనుమతించక పోవడమే మంచిది. ప్రత్యేక సిబ్బందిని నియమించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

జలపాతాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకుంటాం

: నాగరాజు స్వామి, ఎఫ్ఆర్‌వో, ఇచ్చోడ



కుంటాల జలపాతంతో పాటు ఇతర జలపాతాల వద్ద ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటాం. అలాగే ప్రత్యేక సిబ్బందిని నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని పలు జలపాతాల వద్ద గజ ఈతగాళ్ల అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా జలపాతాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక సిబ్బందిని సైతం ఏర్పాటు చేస్తున్నాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

జీవో 49 రద్దు పట్ల హర్షం

- జిల్లాలో పలుచోట్ల సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి):కుంరంభీం టైగర్ రిజర్వు కారీడర్ జీవో 49ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఖానాపూర్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే చిత్రపటాలకు రాజ్‌గోండు సేవా సమితి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మంగళారం మండల కేంద్రంలోని కుంరంభీం కాంప్లెక్స్‌లో రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు కృషి ఉందని రాష్ట్ర నాయకులు మంగం విషయం రావు అన్నారు. అలాగే కుంరంభీం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 13 రోజుల నిరాహార దీక్ష నిర్వహించి, రాష్ట్ర గవర్నర్, కేంద్ర మంత్రిని కలిసి 49 జీవోను రద్దు చేయాలని కోరడం మూలంగా రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కృషి వలన ఆదివాసులకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ఈజీవోను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావ్, జిల్లా ఉపాధ్యక్షుడు పార్చాకి ఆనంద్‌రావు, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు ఆత్రంప్రకాష్, ప్రధాన కార్యదర్శి మడావి బాలాజి, గౌరవ అధ్యక్షులు పుర్కా గజానంద్, ఆడ బీమ్‌రావు, ఆత్రంకా శీరాం, ఆడశంబు, మేస్రం మాణిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, జీవో 49ను సీఎం రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జయవంత్‌రావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు, అటవి శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మావల: కొమురం భీమ్ కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు కోసం ఇచ్చిన జీవో 49ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేయటం హర్షించదగ్గ విషయమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డిలు అన్నారు. జీవో 49ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాటంతో మావల మండల కేంద్రంలోని శ్రీకాంత్ రెడ్డి నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.



ఉట్నూర్‌లో సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రాజ్‌గోండు సేవా సమితి నాయకులు

ఇంద్రవెల్లి: జీవో 49ని ప్రభుత్వం రద్దు చేయడం హర్షనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు.దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సిరికొండ: జీవో 49 వల్ల ఆదివాసీ గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగా ఆ జీవోను రద్దు చేసినందుకు ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం మండల కేంద్రంతో పాటు నారాయణ్‌పూర్ గ్రామంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే బొజ్జు బృందం

అడవి బిడ్డల ఆందోళనకు తెర

ఉట్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని అటవి ప్రాంతాలలో కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్టు కోసం ప్రభుత్వం తెచ్చిన జీవో 49 పై ఎన్నో రోజులుగా అభ్యంతరం తెలుపుతు వస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కృషితో పాటు అడవి బిడ్డల ఉద్యమం తారాస్థాయికి చేరక ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు గిరిజన ప్రతినిధుల బృందం తీసుకువెళ్లి సమస్య తీవ్రతను తెలపడంతో ఎట్టకేలకు జీవో 49ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జీవో రద్దుకు కృషి చేసిన మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావుకి, మంత్రి సీతక్కకి ధన్యవాదాలు తెలిపారు. ఇందులో ఎమ్మెల్సీ దండేవిఠల్, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, తదితరులు ఉన్నారన్నారు.

'సుఖప్రసవాల కోసం ముందస్తు చర్యలు'

ఉట్నూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాల గర్భిణీలను గుర్తించి సుఖ ప్రసవాల కోసం వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయం నుంచి ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్లకు జూమ్ మీటింగ్ నిర్వహించారు.వాగులువంకలతో రోడ్లు కట్ ఆఫ్ అయ్యే గ్రామాల్లోని గర్భిణీ స్త్రీలకు ముందస్తుగా గుర్తించి వారిని సురక్షితంగా పప్రసూతి కోరకు దగ్గరలోని బర్త్ వెయిటింగ్ రూమ్‌లకు గాని, పీహెచ్‌సీలకు గని సీహెచ్‌సీలకు గాని ప్రసూతి సమయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రలు తీసుకోవాల్సిందిగా వైద్య సిబ్బందికి సూచించారు. మలేరియా డెంగ్యూ రాకుండా రాపిడ్ ఫివర్ సర్వే గ్రామ గ్రామాల్లో నిర్వహించి చికిత్సను వెంటనే ఇవ్వాల్సిందిగా అన్ని ఆశ్రమ పాఠశాలల్లో వైద్య పరీక్షలు బాల బాలికలకు నిర్వహించి చికిత్సలు వెంటనే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఉట్నూర్, నాలుగు జిల్లాల డీఎంహెచ్‌ఓలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్స్, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఉమ్మడి జిల్లాల మెడికల్ ఆఫీసర్ అధికారులుతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో పులి గాండ్రింపులు

ఆదిలాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర-ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో పులి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా తడోబ అటవీ ప్రాంతం కేస్లాఘాట్ గ్రామ పరిధిలోని రహదారిని దాటుతున్న క్రమంలో పులి గాండ్రింపులు చేయడంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రోడ్డును దాటుతూ అడవుల్లోకి వెళ్తున్న పులి వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



మహారాష్ట్ర-ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో పులి



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి : ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసు సిబ్బంది సంసిద్ధమై ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ వన్ టౌన్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది విధులను పరిశీలించారు. ప్రతీ ఒక్క వార్డుకు వీపీవోను కేటాయించి సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి సమాచారాన్ని రాబట్టాలని ఎస్పీ సూచించారు. పట్టణంలో ఎలాంటి గంజాయి, గేమింగ్, బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వహించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, విధులలో నిర్లక్ష్యం వహించకుండా, క్రమశిక్షణ సమయపాలనతో ఉండాలన్నారు. కేసుల నమోదు దర్యాప్తులో ఎలాంటి జాప్యం వహించకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. ఇందులో డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్, ఎస్సైలు జి.నాగనాథ్, రమ్య, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పిడుగుపాటుకు గురికాకుండా అప్రమత్తతతో ఉండి తగు చర్యలు చేపట్టాలని, సలహాలు, సూచనలు, సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004251939 కు కాల్ చేయాలని సూచించారు. పిడుగుల బారి నుంచి రక్షణ కోసం తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.



హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ఉట్నూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు మండల కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాకాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, గిరిజన సంక్షేమ జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తెలిపారు. జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులు సెడ్మకి ప్రమోద్, కిరణ్, చౌహాన్ సాయిరాం, ఆత్రం జగ్జీవన్‌లను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తన కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు. పోటీల వివరాలు, వారు మైదానంలో ఆడిన స్థానాలు, సాధించిన గోల్స్ తదితర అంశాలను క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన ప్రయాణ భత్యమును మంజూరు చేస్తున్నామన్నారు. ఈ నెల 23 నుంచి హైదరాబాద్‌లో జరిగే శిక్షణ శిబిరంలో గిరిజన విద్యార్థులు పాల్గొని ఈ నెల 28 నుంచి ఆగస్టు 8 వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ జాదవ్ తానాజి, ఫిజికల్ డైరెక్టర్ జాదోహేమంత్‌నాయక్, కోచ్‌శేకర్, తదితరులు పాల్గొన్నారు.